

ప్రశాంతంగా పదో తరగతి ఇంగ్లీష్ పరీక్ష

ప్రజాశక్తి-కాకినాడ

పదో తరగతి ఇంగ్లీష్ పరీక్ష జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలలో శుక్రవారం ప్రశాంతంగా సాగిందని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ ప్రకటనలో తెలిపారు. మొత్తం 27,575 విద్యార్థులకు గాను 27,369 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 206 మంది పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం తెలుగు, ఉర్దూ పరీక్ష జరిగాయన్నారు. మొత్తం 2,212 మంది విద్యార్థులకు గాను తెలుగు పేపర్ పరీక్షకు 2,023 మంది విద్యార్థులు హాజరు కాగా 189 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. ఉర్దూ పేపర్ 5 మంది విద్యార్థులకు గాను పరీక్షకు నలుగురు విద్యార్థులు హాజరు కాగా ఒక విద్యార్థి పరీక్షకు గైర్హాజరయ్యారని తెలిపారు.

కళాశాలల్లో అధ్యాపకుల కొరత

- ఉన్నత విద్యలో విద్యార్థుల వెనకబాటు
- అవస్థల నడుమ చదువులు
- పట్టించుకోని సర్కారు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ విద్యారంగాన్ని సర్కారు నిర్లక్ష్యం చేస్తోంది. ముఖ్యంగా ఉన్నత విద్యను గాలికి వదిలేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సమస్యలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు తల్లిదండ్రుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. అనేక ఏళ్లుగా రెగ్యులర్ అధ్యాపకులను నియమించకుండానే గెస్ట్ ఫ్యాకల్టీ, పార్ట్ టైమ్ అధ్యాపకులతోనే కాలం వెళ్లదీస్తోంది. దీంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదవాలంటేనే విద్యార్థులు వెనక్కి పరిగెడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. పేద వర్గానికి చెందిన పలువురు తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే సర్కారు కళాశాలల్లో చదువుతున్నారు. కొందరైతే ప్రైవేట్ విద్యాసంస్థలను ఆశ్రయిస్తున్నారు. దీంతో డిగ్రీ విద్య సామాన్యులకు అందని ద్రాక్షలా మారిపోయింది.

జిల్లాలో తుని, తొండంగి, పిఠాపురం, ఏలేశ్వరం, జగ్గంపేట, కాకినాడ ఉమెన్స్, పిఠాపురం రాజా (పిఆర్) కాలేజీలతో బాటు పెద్దాపురంలో మహారాణి, కాకినాడ ఎంఎస్ఎన్ ఛారిటీస్ ఎయిడెడ్ కళాశాలల్లో సుమారు 7 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా బిఎ, బిఎస్సి, కెమిస్ట్రీ, బికాం, కంప్యూటర్స్ తదితర ఆనర్స్ కోర్సులను అభ్యసిస్తున్నారు. అధ్యాపకులు లేకపోవడంతో బోధన సక్రమంగా సాగడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. కొన్నేళ్లుగా ఉద్యోగ విరమణ చేస్తున్న అధ్యాపకుల స్థానంలో కొత్త పోస్టులను భర్తీ చేయడం లేదు. వీరి స్థానాల్లో అరకొర వేతనాలను ఇస్తూ గెస్ట్, పార్ట్ టైం అధ్యాపకులను మాత్రమే నియమిస్తుంది. దీంతో డిగ్రీ విద్య నానాటికీ కుంటుపడుతోంది. నాలుగైదేళ్లతో పోల్చుకుంటే జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య సగానికి పైగా పడిపోయిందంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. ఉదాహరణకు పెద్దాపురం మహారాణి కళాశాలలో ఏడేళ్ల క్రితం దాదాపు 3 వేల మంది విద్యార్థులు డిగ్రీ విద్యను అభ్యసించేవారు. మూడేళ్ల క్రితం 1500 మంది ఉండేవారు. ప్రస్తుతం సుమారు 400 మంది మాత్రమే చదువుతున్న పరిస్థితి. ఇక్కడ ఒక ప్రిన్సిపల్, ఇద్దరు ఫిజిక్స్, ఒక ఎకనామిక్స్ అధ్యాపకుడు మాత్రమే ఉన్నారు. వివిధ కోర్సులను చెబుతున్న మిగిలిన 21 మంది పార్ట్ టైమ్ లెక్చరర్స్ విధుల్లో ఉన్నారు. కళాశాలల్లో దీర్ఘకాలికంగా నెలకొంటున్న సమస్యలతో పాటు ఆన్‌లైన్ అడ్మిషన్ల కారణంగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని అధ్యాపకులు చెబుతున్నారు. మరోవైపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదవాలంటే విద్యార్థులు వెనకడుగు వేస్తున్నారు. సరైన మౌలిక వసతులు లేకపోవడంతో పాటు అధ్యాపకుల కొరత వేధిస్తున్న మూలంగా తమ పిల్లలను సర్కారు కాలేజీల్లో చదివించలేక పోతున్నామని తల్లిదండ్రులు వాపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు కళాశాలల్లో చదివించుకుంటున్నామని చెబుతున్నారు.


పిఠాపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

జిల్లావ్యాప్తంగా 85 ఖాళీలు

జిల్లాలో ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, రెండు ఎయిడెడ్ కాలేజీలు ఉండగా 220 మంది రెగ్యులర్ అధ్యాపకులు ఉండాలి. ప్రస్తుతం 85 ఖాళీలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఖాళీల స్థానంలో పార్ట్ టైమ్ అధ్యాపకులను నియమించి బోధన సాగిస్తున్నారు. వారికి అరకొర వేతనాలను మాత్రమే ప్రభుత్వం అందిస్తోంది. రెగ్యులర్ లెక్చరర్స్‌తో సమానంగా వీరు పని చేస్తున్నప్పటికీ వేతనాల్లో వ్యత్యాసం చూపిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం వివిధ కోర్సులను ప్రవేశ పెడుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించక పోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా కంప్యూటర్ కోర్సులు అన్ని కళాశాలల్లోనూ ప్రవేశపెట్టారు. కానీ ఒక్క పోస్ట్ కూడా ఈ కోర్సుకు సంబంధించి భర్తీ చేయలేదు. పోస్టులు భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు ఇస్తున్నప్పటికీ ప్రభుత్వ స్థాయిలో పట్టించుకోవడం లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.



కూటమి ప్రభుత్వం స్పందించాలి

డిగ్రీ కళాశాలల్లో రెగ్యులర్ అధ్యాపకుల పోస్టుల భర్తీపై కూటమి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి. అన్ని రకాల కోర్సులూ అందుబాటులో ఉన్నా ఫ్యాకల్టీ సదుపాయం లేకపోవడంతో డిగ్రీ విద్య కుంటుపడుతోంది. ప్రభుత్వ కళాశాలల్లో చేరాలంటే విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి.

- ఎం.సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.



అధ్యాపకులను నియమించాలి

డిగ్రీ కళాశాలల విద్య పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది. పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సగం మంది మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులు ఉన్నారు. దీంతో చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. ఇక్కడ కంప్యూటర్ కోర్స్ కు ముగ్గురు అధ్యాపకులు ఉండాలి. కానీ ఒక్కరు కూడా లేరు. అన్ని రకాల కోర్సులు అందుబాటులో ఉన్నా అధ్యాపకుల కొరత వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

- బి.తేజ, డిగ్రీ విద్యార్థి, పిఠాపురం.

పల్లె పండుగ పనులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. పనులను పురోగతిపై శుక్రవారం అమరావతి సచివాలయం నుంచి ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్, పంచాయతీరాజ్ గ్రామీణ అభివద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్, డైరెక్టర్ కృష్ణ తేజ, ఆర్‌డబ్ల్యుఎస్ ఉన్నత స్థాయి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సంబంధిత శాఖ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ నెల 22న ప్రపంచ జల దినోత్సవం కార్యక్రమం నిర్వహణ, పల్లె పండుగ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సిసి రోడ్డు, మినీ గోకులాలు, ఫారం ఫండ్స్ ఇతర పనుల ప్రగతిని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జిల్లాల కలెక్టర్లతో చర్చించారు. నిర్దేశించిన లక్ష్యంలోపు పనులు పూర్తి చేయడంతో పాటు భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై జిల్లా అధికారులకు ఆయన దిశా నిర్దేశనం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఈ నెల 22 శనివారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామం పంచాయతీ పరిధిలో ఫారం ఫండ్స్ పనుల గ్రౌండింగ్ చేయాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులను తప్పనిసరిగా ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం 123 కోట్ల పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డిపిఒ రవికుమార్, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ జి.రామ్ కుమార్, ఎస్ఇ ఎవిఎస్.శ్రీనివాసు, ఇఇ మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎడి ఎన్.భారతి పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం సక్రమంగా చేపట్టాలి

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక 29వ వార్డు చిట్టోడి తోట, రజక వీధిలో డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్మించి మురుగు నీరు పారేలా చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు కోనేటి రాజు డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం పార్టీ బృందం పరిశీలన చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా కోనేటి రాజు మాట్లాడుతూ పంట పొలాలకు పైనుంచి నీరు విడుదల చేసినప్పుడు డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో చిట్టోడి తోట, రామ కోవెల వద్ద రోడ్లు పైకి నీరు చేరి ఇళ్ళ ముందు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను అనేక మార్లు మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన అధికారులు వచ్చి చూసి వెళ్లడం తప్ప సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. మురికి నీరు నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా పెరిగి పోతున్నాయని, ఆ ప్రాంతంలో కోళ్ల ఫారం నుంచి దుర్గంధం వస్తోందని బృందానికి స్థానికులు తెలియ జేశారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ అభివద్ధి చేసి ఇళ్ళ ముందు మురుగునీరు నిలవకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ కె.చిన్న, విశ్వనాథం, వీరబాబు, నాగేశ్వరరావు, రాజేష్, సూర్యనారాయణ, నందీశ్వర రావు, డి.సత్యనారాయణ, శ్రీను, వై.రాజు పాల్గొన్నారు.


డ్రైనేజీ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

దేశంలో న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని తక్షణమే న్యాయవాదులకు న్యాయవాద పరిరక్షణ చట్టం అమలు చేయాలని ఐలాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగత శివ డిమాండ్ చేశారు. ఐలాజ్ పిలుపు మేరకు మార్చి 21న దేశ వ్యాప్తంగా న్యాయవాదుల రక్షణ చట్టం కోసం నేషనల్ ప్రొటెస్ట్ డే నిర్వహించినట్టు తెలిపారు. రాజకీయ కేసులు, మానవ హక్కుల కేసులు వాదిస్తున్న న్యాయవాదులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సంఘ విద్రోహ శక్తుల నుంచి, పోలీసుల నుంచి, ముఠాల నుంచి న్యాయ వాదులపై మాకుమ్మిడి దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ఇటువంటి దాడులను అరికట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాద రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజస్థాన్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో రూపొందించినట్టు మన రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అవసరాల దేవి, రాజాల చిట్టిబాబు, బండారు నరసింహారావు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న స్థానిక నాయకులు

ప్రభుత్వ భూమిని కాపాడాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

సుంకరపాలెంలో చేపల మార్కెట్‌కు ఇచ్చిన భూమి ప్రభుత్వ నిషేధిత జాబితా లోనిదని, సర్పంచ్ నాగేశ్వరరావుది కాదని గ్రామంలో పలువురు అన్నారు. స్థానిక స్థలంలో సుంకరపాలెం ఎంపిటిసి సభ్యుడు గుత్తుల శ్రీనువాస్, లచ్చిపాలెం సొసైటీ మాజీ అధ్యక్షుడు మోపూరి వెంకటరెడ్డి నాయుడు, వార్డు సభ్యులు పితాని అర్జునరావు, కుడుపూడి సుబ్రహ్మణ్యం, నాయకులు వడ్డి ఏడుకొండలు, గుత్తుల నాగేశ్వరరావు, చిక్కం హనుమంతరావు, పితాని కామరాజు, నాగాబత్తుల వెంకటేష్, మద్రి అశోక్, మాకిరెడ్డి శివశంకర్, శీలం వీరభద్రం శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఆ భూమి తనదంటూ సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు చెప్పుకోవడం సరికాదని ఖండించారు. మోపూరి వెంకట రెడ్డి నాయుడు ఫిర్యాదు మేరకు సర్వే నెంబర్ 123, 125లో భూమి ప్రభుత్వానిదని పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన పత్రాన్ని మీడియాకు అందజేశారు. ఇక్కడ నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదు చేసినందుకు కేసులు పెట్టి బెదిరిస్తున్నారని అన్నారు. దీనిపై డిప్యూటీ తహశీల్దారు సూరిబాబు వివరణ కోరగా సర్వే నెంబర్ 123, 125 లోని భూమిని త్వరలోనే సర్వే చేసి నిర్ధారణ చేయనున్నట్లు తెలిపారు.

పరిశ్రమల స్థాపనతో ఉద్యోగాల కల్పన

ప్రజాశక్తి-కాకినాడ

పరిశ్రమల స్థాపన ద్వారా ఉద్యోగాల కల్పన సాధ్యమని సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల చైర్మన్ టి.శివశంకర రావు అన్నారు. స్థానిక విద్యుత్ నగర్ ఐడియల్ డిగ్రీ కళాశాలలో గ్రోత్ ఇంజిన్ ఆఫ్ ఇండియా అనే అంశంపై రెండురోజుల జాతీయ సదస్సును ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఆలోచనలు, అభివృద్ధి విషయంలో ప్రజా భాగస్వామ్యం కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు తరచూ చెబుతున్నారని, ఇలాంటి సదస్సులు అందుకు తోడ్పడతాయని తెలిపారు. ఎంఎస్ఎంఇ కార్పొరేషన్ ద్వారా డబ్బు పెట్టుబడి లేని వాళ్ల కుడా సంపద సృష్టించగలరన్నారు. ఈ కార్పొరేషన్ ద్వారా లక్షల ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఇరవై లక్షల ఉద్యోగాల కల్పన అంటే అన్నీ ప్రభుత్వ ఉద్యోగాలే అని భావించడం సరికాదని, పరిశ్రమల స్థాపన ద్వారా కుడా ఉద్యోగ కల్పన జరుగుతుందని, పరిశ్రమలంటే నగరాల్నే ఊహించకూడదని, గ్రామీణ ప్రాంతాల్లోనూ అవకాశం ఉందని ఆయన అన్నారు. ఐడియల్ కళాశాలల సెక్రటరీ కరెస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవిని కుమారి మాట్లాడుతూ చదివితే ప్రభుత్వమే ఉద్యోగాలిస్తుందనే భావంలో మార్పు వచ్చిందని, విద్యార్థి విజ్ఞాన సంపద పెంచుకుంటే ఎంఎస్ఎంఇ వంటి సంస్థల ద్వారా తన ఉద్యోగం తానే సృష్టించుకోగలడని, అందుకే ప్రభుత్వ ఎంఎస్ఎంఇ సంస్థ ఆశయాలను విద్యార్థులకు అందించడానికి తమ కళాశాల అకడమిక్ డైరెక్టర్ ఎం.రంజిత్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ కెఎస్.వాసు సారథ్యంలో ఈ జాతీయ స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సదస్సులో తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ కామర్స్, మేనేజ్మెంట్ విశ్రాంత ప్రొఫెసర్ ఆచార్య హిమాచలం దాసరాజు ప్రధాన వక్తగా పాల్గొని, ఎంఎస్ఎంఇ కార్పొరేషన్ - కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం, వికసిత్ భారత్ ఉద్దేశాలు, యువ విద్యార్థులకు వివరించారు.



సదస్సులో మాట్లాడుతున్న శివశంకర రావు

శివారు భూములకు సాగునీరు ఇవ్వాలి

ప్రజాశక్తి-కాజులూరు

గామాల్లోని శివారు భూములకు సాగునీరు అందించాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు సాగునీరందని పంటపొలాలను పరిశీలించారు. కాజులూరు మండలం ఆర్యావటం శివారు తుమ్మలపల్లిలంక తోపాటు మండలంలోని పలు గ్రామ శివారు ప్రాంతాల్లో సాగునీరు అందక వరి పంట బీటలు వారుతున్నాయని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతో రూ.లక్షలు పెట్టుబడి పెట్టిన తరువాత మండలంలో కాలువ శివారు భూములు అన్ని చోట్లా ఇదే పరిస్థితి ఏర్పడిందని, దీనికి కారణం ఇరిగేషన్ అధికారుల వద్ద నీటి సామర్థ్యం యొక్క ప్లానింగ్ లేకపోవడమే అన్నారు. చింతపల్లి లాకుల వద్ద నుంచి ఈ ఏరియా దూరం కావడం వల్ల కిందవరకు సాగునీరు అందడం లేదన్నారు. ముందుగా గ్రహించిన కొంతమంది రైతులు సుమారు 100 ఎకరాల పైబడి ఈ ప్రాంతంలో విత్తనాలు చల్లలేదని, చల్లిన వాటికి నీరు లేక రైతులు గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. తాత్కాలికంగా పైనుంచి కింద వరకు సాగునీరు వథా కాకుండా కాలవ చివర భూములకు యుద్ధ ప్రాతిపదికన సిబ్బంది నియమించి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో ఈ సమస్యను అధికారులు శాశ్వతంగా పరిష్కరించి సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గిసాల భీమేశ్వరరావు, పోలినాటి కృష్ణయ్య, పోలనాటి హనుమంతు, గిసాల కొండయ్య, కాకరపల్లి విశ్వనాథం పాల్గొన్నారు.



ఎండిన పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు


బిల్లులు చెల్లించాలని ఆందోళన చేస్తున్న కాంట్రాక్టర్లు

బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ఆందోళన

ప్రజాశక్తి-కాకినాడ

ఆరేళ్లుగా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తక్షణమే బకాయిలు చెల్లించాలని కోరుతూ కాంట్రాక్టర్లు శుక్రవారం ఆందోళన చేపట్టారు. శారదా దేవి గుడి వద్ద ఉన్న కార్పొరేషన్ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ఎస్.శాంతారామ్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ల ప్రస్తుత ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, కుటుంబాలను పోషించుకోవడంలో ఇబ్బందుల కారణంగా మార్చి, 2025 నాటికి తమ బకాయి బిల్లులకు అవసరమైన చెల్లింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ అండ్ బి విభాగంలో రూ,.1,350 కోట్లు, నాబార్డు సహా వివిధ ప్రణాళికల కింద నిధుల క్లియరెన్స్ చేయాలన్నారు. బిల్లులు మొత్తం రూ.500 కోట్లు, ఎండింగ్‌లో ఉన్న చెల్లింపులు రూ.800 కోట్లు, అదనంగా రూ.500 కోట్ల బడ్జెట్ పరిమితుల కారణంగా (ఎఎంసి గ్రాంట్ సహా) అప్లోడ్ చేయని బిల్లులను కలిగి ఉంటాయన్నారు. ఇతర రంగాలలో పెండింగ్ చెల్లింపులు రూ.5,000 కోట్లు క్లియరెన్స్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్స్, ప్రతినిధులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జిల్లాపరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ గణపతి

ఎంఎస్ఎంఇ సర్వే వేగంగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-పెద్దాపురం

సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమ స్థాపకులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా చేయూత అందించేందుకు నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఇ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ గణపతి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమ స్థాపకులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పెద్దాపురం మండల పరిధిలో ఎంఎస్ఎంఇ సర్వే నిర్వహించి 1,249 మందిని గుర్తించినట్టు తెలిపారు. వీరిలో 149 మందికి మాత్రమే రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు. మిగిలిన 1100 మందికి రిజిస్ట్రేషన్ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎంపిడిఒ శ్రీ.లలిత మాట్లాడుతూ ఉద్యం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రతి గ్రామ సచివాలయం నుండి జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారులు సందీప్, ఎ.వీరభద్రరావు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో డౌన్ సిండ్రోమ్ డే

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రపంచ డౌన్ సిండ్రోమ్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల ఆవరణలోని భవిత వికలాంగుల పాఠశాలలో డౌన్ సిండ్రోమ్ మానసిక వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహాత్మా గాంధీ మున్సిపల్ స్కూల్ హెచ్ఎం ఎంఎల్.శివజ్యోతి మాట్లాడుతూ డౌన్ సిండ్రోమ్ వ్యాధిపై అందరికీ అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. జన్యు పరమైన క్రోమోజోమ్స్ వల్ల వచ్చే ఈ సమస్యపై అవగాహన పెంచుకోవడం ద్వారా నివారణ చర్యలు తీసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బి.దుర్గాప్రసాద్ రెడ్డి, బి.ఆనందరావు పాల్గొన్నారు.

ఘనంగా వనదుర్గమ్మ వార్షికోత్సవం

ప్రజాశక్తి-కిర్లంపూడి

వీరవరంలో ఉన్న వనదుర్గమ్మ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించారు. ప్రధాన అర్చకులు సూర్య దత్త మోహన్ దత్తవారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కర్రి శ్రీను, వెలుగుల సూరిబాబు, చింతల సత్యానందరావు, చింతల విజయ్ కుమార్, దంటా సుబ్బారావు, అమ్మసాల యువరాజు, కర్రి సాయి, మద్ర సుబ్బారావు, మరోతి గోవిందు, దంతా సరేష్, జనపరెడ్డి శివ, పుర్రి రాంపండు పాల్గొన్నారు.

స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వ ఆదేశాలను, నిబంధనలను ధిక్కరించి రెండు పూటలా బడులు నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు గోపాలకష్ణ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుండి ఒంటిపూట బడులు అమలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఒంటి పూట బడుల విధానాన్ని పగడ్బందీగా అమలు చేయవలసి ఉందన్నారు. కొన్ని ప్రైవేటు పాఠశాలలు ఒంటి పూట బడి విధానాల్ని అమలు చేయకుండా రెండుపూటల బడులు నిర్వహిస్తున్నాయన్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులు పరిశీలన జరిపి నిబంధనలు ధిక్కరించి రెండు పూటలా పాఠశాలల నిర్వహిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రెండో రోజు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - పెద్దాపురం


పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని సామర్లకోట, పెద్దాపురం మండలాలకు సంబంధించి పెద్దాపురం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం, ఎన్‌టిఆర్ కాలనీలోని రాజు మున్సిపల్ పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు శుక్రవారం రెండో రోజు కూడా కొనసాగాయి. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో బాలలు విద్యతో పాటు సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు అంగన్‌వాడీ సూపర్వైజర్లు తెలిపారు. పోషణ్-పడాయి లక్ష్యంతో ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ శిక్షణా తరగతులు ఈ నెల 22వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఈ శిక్షణా తరగతులలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు చంద్రకళ, ఎన్.ఉమాదేవి, టివి.రమణమ్మ, వీరలక్ష్మి, సత్తార్.బి, మంగ, నిర్మల అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు.

ప్రగతిలో టోస్ట్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ కాంటెస్ట్

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో టోస్ట్ మాస్టర్స్ ఇంటర్ నేషనల్ ఏరియా ఐ-1 కాంటెస్ట్‌లో భాగంగా ఇంటర్నేషనల్ స్పీచ్ కాంటెస్ట్, టేబుల్ టాపిక్ కాంటెస్ట్ నిర్వహించినట్టు కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ టోస్ట్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ కాంటెస్ట్‌లో పాల్గొని విజేతలైన విద్యార్థులు డివిజనల్ లెవెల్‌కు అర్హత సాధిస్తారని వీటిలో పాల్గొడానికి తమ సమీప కళాశాలలైన ఎస్ఆర్‌కెఆర్ శ్రీ విష్ణు ఇంజనీరింగ్ కాలేజ్, కైట్ కాలేజీల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు స్పీకింగ్ స్కిల్స్‌ను మెరుగు పరుచుకుంటూ, ఆత్మ విశ్వాసంతో విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్ మేనేజ్మెంట్ ఎంవిజహరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరక్టర్-అకడమిక్స్ డాక్టర్ కె.సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ జి.నరేష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న మండపేట సిఐ సురేష్

కుమార్తే హంతకురాలు

ప్రజాశక్తి - మండపేట

తండ్రి హత్య కేసులో కుమార్తె హంతకురాలిగా తేలింది. తన సంతోషాలకు అడ్డుగా ఉన్నాడనే కారణంగా ప్రియునితో కలిసి కన్న తండ్రిని హత్య చేసింది. మండపేట సిఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు...మండపేట మేదరపేటకు చెందిన సురా రాంబాబుకు వెంకటదుర్గ అనే కుమార్తె ఉంది. ఆమెకు వివాహమై భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త, పిల్లలతో కలిసి మండపేటలోనే నివాశముంటుంది. కొంత కాలంగా రామచంద్రపురం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ముమ్మిడివరపు సురేష్‌తో దుర్గ వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలియడంతో భర్త ఆమె నుంచి విడిపోయి అదే ప్రాంతంలో ఒంటరిగా ఉంటున్నాడు. దుర్గ తీరులో మార్పు రాకపోవడంతో తండ్రి రాంబాబు సైతం ఆమెను గట్టిగా మందలించాడు. దీంతో ఎలాగైనా తండ్రిని మట్టుబెట్టాలనుకుంది. ఈ మేరకు రాంబాబు హత్యకు ప్రియునితో కలిసి ప్రణాళిక వేసింది. మార్చి 16 రాత్రి ప్రియుడు సురేష్‌కు ఫోన్ చేసి ఇంటికి పిలిచింది. స్నేహితుడు తాటికొండ నాగార్జునను వెంటబెట్టుకుని సురేష్ మండపేటలో దుర్గ ఇంటికి వచ్చాడు. అక్కడ నుంచి వీరు ముగ్గురూ స్థానికంగా ఉంటుంటున్న రాంబాబు ఇంటికి వెళ్లారు. పడుకున్న రాంబాబు కాళ్లు చేతులు గట్టిగా పట్టుకుని గొంతు నులిమి హత్య చేశారు. రాంబాబు సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు ప్రారంభించారు. పోస్టు మార్టం రిపోర్టులో హత్యగా తేలడంతో దర్యాప్తును వేగవంతం చేశారు. అనుమానితురాలిగా ఉన్న దుర్గను ప్రశ్నించడంతో పక్కా ప్రణాళిక ప్రకారమే తండ్రిని చంపినట్లు అంగీకరించింది. నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసి రామచంద్రపురం కోర్టుకు తరలించగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని టౌన్ సిఐ సురేష్ తెలిపారు.

పొగాకు బేరన్ దగ్ధం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని వాదాలకుంటలో శుక్రవారం జుజ్జువరపు రామలక్ష్మికి చెందిన పొగాకు బేరన్ దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.5లక్షల నష్టం వాటిల్లింది. క్యూరింగ్ చేస్తున్న సమయంలో పొగాకు కర్రలు ఊడిపడి ప్రధాన గొట్టంపై పడడంతో మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు. మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా అదుపు కాకపోవడంతో జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. జంగారెడ్డిగూడెం నుండి అగ్నిమాపక వాహనం హుటాహుటిన తరలివచ్చి మంటలను అదుపు చేశారు. టీవల కాలంలో తరచూ అగ్ని ప్రమాదాల సంభవించి లక్షలాది రూపాయలు విలువ చేసే వర్జీనియా పొగాకు కాలిపోవడంతో రైతులకి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. గోపాలపురం నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - రాజానగరం

తన భర్త కనపడడం లేదంటూ రాజానగరం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఒక మహిళ ఫిర్యాదు చేసింది. శ్రీరాంపురం గ్రామానికి చెందిన కరెడ్ల రాంబాబు (36) తాపీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 8న ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాంబాబు తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల దగ్గర వెతికినా సమాచారం లేకపోవడంతో అతని భార్య కుసుమ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్.ఐ నాగార్జున కేసు నమోదు చేశారు.

అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి జైలు

ప్రజాశక్తి - అయినవిల్లి

చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి అయిదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించారని పి.గన్నవరం సిఐ ఆర్.భీమరాజు శుక్రవారం తెలిపారు. అయినవిల్లి లంక గ్రామ శివారు గాలితిప్పపేటకు చెందిన డెక్క రాంబాబు అదే గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారిపై 2023లో అత్యాచారయత్నం చేశాడు. పాప తల్లికి జరిగిన విషయం చెప్పడంతో పోలీస్ స్టేషన్‌లో రాంబాబుపై ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు కేసు నమోదు చేసి. దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుపై శుక్రవారం కాకినాడ ఫోక్స్ కోర్టులో న్యాయమూర్తి కె.శ్రీదేవి నిందితునికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష. వెయ్యి రూపాయలు జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాది జి వెంకటరత్నం వాదనలు వినిపించారు.

పాము కాటుతో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి-కిర్లంపూడి

కృష్ణవరం గ్రామపంచాయితీ పరిధిలో పంట కాలువలో శుక్రవారం పూడికతీత పనిచేస్తుండగా ఉపాధి హామీ పని వేతనదారుడు నీలాద్రి అప్పారావు పాము కాటుకు గురయ్యారు. వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్టు ఎపిఒ నాయుడు తెలిపారు.

ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కాజులూరు

ఆదరణ పథకాన్ని వెనుకబడిన వర్గాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ జె.రాంబాబు కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బిసి నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ మండలంలోని బిసిలకు వారి కుల వృత్తులకు అవసరమైన పరికరాలను పరికరాలను ప్రభుత్వం అందించే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. త్వరలో ఈ పనిముట్లు ఆర్హులైన వారికి అందించడానికి ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

యానాం వార్తలు



షాపులు మూసివేయడంతో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

యానాంలో బంద్ ప్రశాంతం...

ప్రజాశక్తి - యానాం

డంపింగ్ యార్డ్, చెత్త సమస్యపై ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరశిస్తూ శుక్రవారం యానాంలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. డంపింగ్ యార్డ్ సమస్యతో పట్టణ, గ్రామ ప్రాంతాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయిన నేపథ్యంలో అన్నా డిఎంకె పార్టీ యానాం కార్యదర్శి మంచాల సత్యసాయి కుమార్ బంద్‌కు పిలుపునిచ్చారు. దీనికి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, యానాం వర్తక సంఘం, ఎన్ఆర్.కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ తదితరులు సంపూర్ణ మద్దతు పలికారు. ఈ బంద్ పిలుపుతో యానాంలో మెడికల్ షాపులు మినహా అన్ని ఆసుపత్రులు, బ్యాంకులు, ఇతర వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. ఆయా వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేయగా పలు చోట్ల స్థానిక నాయకులు ఆయా దుకాణాలను మూయించారు. యానాం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచాల సత్యసాయి కుమార్, మాగాపు సుబ్బారావు, నల్లా వెంకన్న, కాపగంటి గోపాలకృష్ణ, చెక్కల అరుణ్ కుమార్, తోట మల్లికార్జునరావు పాల్గొన్నారు. బంద్ విజయవంతానికి కృషి చేసిన, సహకరించిన నాయకులకు,వర్తక సంఘం ప్రతినిధులకు, వ్యాపారులకు, ప్రజలకు అందరికీ మంచాల సత్యసాయి కుమార్ కతజ్ఞతలు తెలిపారు.

రూ.కోటితో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - యానాం

ఆది ద్రావిడ సంక్షేమ శాఖ ద్వారా నియోజకవర్గంలో రూ.కోటితో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆ శాఖ మంత్రి సాయి శర్వనన్ తెలిపారన్నారు. ఆ పనులకు సంబంధించిన ఫైల్ గవర్నర్ దగ్గర ఉందన్నారు. గవర్నర్ ఆమోదం పూర్తయిన తర్వాత టెండర్లకు పిలిచి దరియాలతిప్ప, ఫరంపేట, మెట్టకూరు ఆది ఆంధ్ర పేట, రమాబాయి నగర్ తదితర గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు, ఇతర పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

పరిశ్రమలు తెరిచేలా సహకరించాలి

ప్రజాశక్తి - యానాం

యానాంలో మూత పడ్డ వందలాది చిన్నతరహా, మధ్య తరహా, భారీ పరిశ్రమలను తిరిగి తెరిచేవిధంగా సహకరించాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ కోరారు. శుక్రవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. వేలాది మందికి ఉపాధిని కల్పించడంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా యానాం ఆర్థికాభివద్ధికి తోడ్పడ్డ రీజెన్సీ భారీ పరిశ్రమ 13 ఏళ్ళుగా మూత పడిందని తెలిపారు. దాన్ని తెరిచేవిధంగా సహకరించాలని, ఆ విధంగా యాజామాన్యాన్ని సైతం ప్రోత్సహించాలని కోరారు. కొన్ని నెలల క్రితం రీజెన్సీ ఫ్యాక్టరీని తెరిచేలా సంబంధిత యాజమాన్యం చర్యలు తీసుకుంటే వివిధ కారణాలతో పాటు ప్రభుత్వం నుంచి సరియైన స్పందన లేకపోవడంతో మళ్లీ మూసివేశారన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు కృషి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సాలిడ్ వేస్టే మేనేజ్మెంట్ రిసోర్స్ పర్సన్ పాము వెంకటేశ్వ రరావు అన్నారు. ఆనాతవరం పంచాయతీ పరిధిలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్ వద్ద శుక్రవారం ఇఒపిఆర్‌డి కె.లక్ష్మి కల్యాణి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్ర(పారిశుధ్య సిబ్బందికి) ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చి దిద్దేందుకు చెత్తను రోడ్డు పక్కన, మురుగు డ్రయినేజీల్లో వేయవద్దన్నారు. ఇంట్లో వాడిన తడి, పొడి, ఘన వ్యర్థా లైన చెత్తన పంచాయతీ పరిధిలో పని చేసే క్లాప్ మిత్రాలు చెత్తను సేకరించే వాహనాల్లో ఇంటింటికి వెళ్లి తడి, పొడి, హానికర చెత్తలను సేకరిస్తారన్నారు. వాటిని సాలిడ్ వేస్టే మేనేజ్మెంట్ కేంద్రాలకు తరలించి తడి, పొడి, హానికర చెత్తను వేరు వేరు చేయడం ద్వారా ప్రాసిసింగ్ చేయడం సులభతరం అవుతుందన్నారు. తడి చెత్త నుండి ఎరువులు, వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేయవచ్చునని, పొడి చెత్తను రీ సైక్లింగ్ చేయడం ద్వారా వాతావరణాన్ని కాపాడవచ్చునన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిమ్మితి చిరంజీవి, ఉప్పలగుప్తం ఇఒపిఆర్‌డి రాజ్ కుమార్, పంచాయతీ కార్య దర్శి సిహెచ్‌వి కె.సురేష్ క్లాప్ మిత్రాలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన

ప్రజాశక్తి - అల్లవరం

కొమరగిరిపట్నంలో ట్రైనింగ్ సెంటర్ ఎస్‌డబ్ల్యూపిసి షెడ్ వద్ద అల్లవరం, అమలాపురం, మామిడికుదురు, మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రా లకు చెత్త నుంచి సంపద తయారీ పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్ర్యమంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనితీరు, తడి చెత్త పొడి చెత్త వేరు చేయుట, నాడెపు తొట్టెలలో సెమీ కంపోస్ట్ తయారి విధానం, వెర్మీ తొట్టె లలో వెర్మీ కంపోస్ట్ తయారీ విధానం పై అల్లవరం విస్తరణ అధికారి యూ నాగేంద్ర , ఫ్ టి సి మధు మహేష్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్ర్యమంలో గ్రామ సర్పచ్ రాకాపు విజయలక్ష్మి, మామిడికుదురు, అమలాపురం మండలాల విస్తరణ అధికారులు పాల్గొనియున్నారు.

అసెస్మెంట్ పరీక్ష నిర్వహణపై సమావేశం

ప్రజాశక్తి - ఆలమూరు

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఐ.రాజు ఆధ్వర్యంలో ఉల్లాస్ వయోజన విద్య అభ్యాసకులకు అసెస్మెంట్ పరీక్ష నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లపై డిఆర్‌డిఎ, ఐసిడిఎస్, విద్యాశాఖలతో సమన్వయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈనెల 23న మండలంలో గల 792 మంది ఉల్లాస్ అభ్యాసకులకు అసెస్మెంట్ పరీక్ష మండలంలో గల 28 పరీక్షా కేంద్రాలలో పరీక్షలకు ఏర్పాట్లు చేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ఈ పరీక్షకు సంబంధించి ఎన్విజిలేటర్లుగా అంగన్‌వాడీ టీచర్లను నియమించామన్నారు. ఆదివారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గుర్తించిన ప్రభుత్వ పాఠశా లల్లో 28 సెంటర్లలో పరీక్ష నిర్వహిస్తా రన్నారు. ఈ పరీక్ష నిర్వహణకు సంబంధిం చిన మెటీరియల్ను డ్వాక్రా యానిమేటర్ల ద్వారా గ్రామాలకు పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉల్లాస్ మోడల్ ఆఫీసర్ విజయభాస్కర్, ఎంఇఒ బి.అప్పాజీ, ఎపిఎం ఎం.ధనరాజు, అంగన్‌వాడీ సూపర్వైజర్లు నాగలక్ష్మి, అరుంధతి, అంగన్వాడి టీచర్లు, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో మహిళలకు రక్షణ

ప్రజాశక్తి - మండపేట

మార్షల్ ఆర్ట్స్ మహిళలకు రక్షణ ఉంటుందని మండపేట రూరల్ ఎస్ఐ బుచ్చిబాబు అన్నారు. ఇప్పనపాడు ప్రభుత్వ పాఠశాల లో శుక్రవారం బాలికలకు మార్షల్ ఆర్ట్స్ నిపుణులు గ్రాండ్ మాస్టర్ టి. అబ్బులు నేతృత్వం లో ఆత్మ రక్షణ మెళకువలలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీసు శాఖ మహిళలకు రక్షణగా ఉంటుందన్నారు. విద్యార్థి దశ నుంచి బాలికలు స్వీయ సంరక్షణ నేర్చుకోవడం చాలా అవసరమన్నారు. కరాటే లో శిక్షణ ఎంతగానో ఉపకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ, మదర్ థెరిసా సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఫౌండర్ టి. అబ్బులు, మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ ఎం.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ మెటీరియల్స్, ఎనర్జీ సైన్స్ (ఐసిఎంఇఎస్-2025)పై రెండు రోజుల కార్యక్రమం ఉత్సాహంగా ప్రారంభమైందని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ ప్రోగ్రాం ముఖ్య అతిథిగా ఎన్ఐటి వరంగల్ ప్రొఫెసర్ వై.రవికుమార్ హాజరయ్యారు. డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ ఇటువంటి సదస్సులు ఉపాధ్యాయ సిబ్బందికి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం అన్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంత విజ్ఞానదాయకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మెకానికల్ విభాగం వారికి అభినందనలు తెలిపారు.

డిజైన్ థింకింగ్‌పై వర్క్ షాప్

ఆదిత్య కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో హైడ్రో ట్రైబ్ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ తరుణ్ కె.కరణం ఆధ్వర్యాన డిజైన్ థింకింగ్, ఇన్నోవేషన్‌పై రెండు రోజుల వర్క్ షాప్ నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. డిజైన్ థింకింగ్ ప్రాముఖ్యత గురించి ప్రిన్సిపల్ విద్యార్థులకు వివరించారు.

అపరాల సాగుతో అదనపు ఆదాయం

ప్రజాశక్తి-కాజులూరు

అపరాల సాగుతో ఆదాయం లభిస్తుందని కరప ఎడిఎ కె.బాబూరావు అన్నారు. శుక్రవారం మండలంలోని తర్లంపూడి, టి.మామిడాడ, శీల గ్రామాల్లో భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల యాజమాన్య పద్ధతిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు మండల వ్యవసాయ అధికారి అశోక్ ఆధ్వర్యంలో కరప ఎడిఎ బాబూరావు, కౌలు రైతులకు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఎడిఎ బాబూరావు మాట్లాడుతూ భూసార పరీక్షలు వేసవి అపరాల సాగుపై పలు సూచనలు చేశారు. రైతులందరూ వేసవి పంటగా మినుము, పెసరు పంటలను పండిచాల్సిందిగా కోరారు. వాటికి అవసరమైన విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తుందని తెలిపారు. ఈ పంటల ద్వారా రైతులు అదనపు ఆదాయంతో పాటు భూసారాన్ని పెంపొందించుకోవచని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ శ్రీనివాస్, సర్పంచులు నరాల బాలరాజు, కోమలి వెంకట రమణ, ఎంపిటిసి గొల్లపల్లి సింహాద్రి, వ్యవసాయ సహాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

ఆదరణ పనిముట్లపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వం ప్రకటించిన ఆదరణ-3 పథకం ద్వారా అందజేసే పనిముట్లు, సామగ్రిపై చేతి వృత్తిదారులు అవగాహన పెంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పరిధిలోని వివిధ చేతి వృత్తిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వివిధ రకాల చేతివృత్తిదారులు తమ వృత్తికి, ఉపాధికి అవసరమయ్యే పనిముట్లు, మిషనరీ సామగ్రి ఉపయోగాలతో వివరాలు లికిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. ప్రభుత్వం చేతి వృత్తిదారులందరికీ ఆదరణ పథకం ద్వారా పనిముట్లు, సామగ్రి అందజేస్తుందన్నారు. చేతివృత్తిదారుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతి రాణి, తాతాజీ, మెప్మా సిఎం ఎం.భ్రమరాంబ, సిఒలు నర్గీస్, శ్రీదేవి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు వీరబాబు పాల్గొన్నారు.

విద్యార్థికి విసి అభినందనలు

ప్రజాశక్తి-కాకినాడ



సాయి చరణ్‌ను అభినందిస్తున్న విసి

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) - 2025 పరీక్షల్లో 967 స్కోర్‌తో జాతీయ స్థాయిలో 9వ ర్యాంకు సాధించిన యుసిఇకె ఇసిఇ విభాగం విద్యార్థి సిహెచ్.సాయి చరణ్‌ను విసి ప్రొఫెసర్ సిఎస్ఆర్‌కె. ప్రసాద్ అభినందించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సాధనతో కృషి చేస్తే ఉత్తమ ర్యాంకులు సాధించవచ్చునన్నారు. విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు పట్టుదలతో చదివినపుడు విజయాన్ని సునాయాసంగా అందుకోగలరన్నారు. రాబోయే కాలంలో పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జెఎన్‌టియుకె కీర్తిని ఇనుమడింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రవీంద్రనాథ్, ఐఐఐపి అండ్ టి డైరెక్టర్ ప్రొఫెసర్ బిటి.కృష్ణ, యుసిఇకె ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎన్.మోహనరావు, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ బి.లీలాకుమారి పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ


ప్రజాశక్తి-శంఖవరం

మండల కేంద్రమైన శంఖవరం కస్తూరిబా బాలికల పాఠశాల కళాశాలలో 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ బాలామణి తెలిపారు. బడి బయట పిల్లలు, మధ్యలో బడి మానేసిన వారు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ వర్గాల చెందిన బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తామని,కళాశాల నోటీస్ బోర్డులో లిస్టు ప్రకటిస్తామని ఆమె తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9618146624, 7288096339 నెంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపల్ బాలమణి కోరారు.

పశువుల గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తిలో పశువుల ఎండు గడ్డి వామి దగ్ధమయ్యింది. ఇబిసి కాలనీలో నివాసముంటున్న పిర్ల సత్తిబాబు పశువుల మేత నిమిత్తం ఇటీవల రెండెకరాల గడ్డివామి వేసుకున్నారు. శుక్రవారం ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధం కావడంతో వెంటనే పిఠాపురం నుండి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేయడానికి తీవ్రంగా కృషి చేశారు.



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీలు

చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

అంగన్‌వాడీ చిన్నారులకు పోషకాహార లోపం రాకుండా ప్రతి కార్యకర్తా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విస్తరణాధికారులు నళిని, రమణి కుమారి, నిభావని, లలిత నిర్మల అన్నారు. నీలపల్లి, చొల్లంగి హైస్కూల్లో జరిగిన పోషన్ పడాయి రెండో రోజు శిక్షణలో అంగన్వాడీలకు పలు విషయాలు బోధించారు. చిన్నారులకు పోషక సూక్ష్మ పోషక లోపాలు ఉండటంవల్ల ఎదుగుదల తగ్గుతుందని అన్నారు. తల్లి పాలు ప్రాముఖ్యతను తెలియజేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు విషయాలను వివరించారు.

పోలీసు స్టేషన్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి-రౌతులపూడి

పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులకు అనువైన స్థల కోసం ప్రత్తిపాడు సిఐ సూరి అప్పారావు, ఎస్ఐ వెంకటేశ్వరరావు మండల కేంద్రంలో శుక్రవారం పరిశీలించారు. త్వరలో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులకు చేపట్టేందుకు చర్యలు తీసుకునేందుకు స్థల సేకరణ చేపడుతున్నామని పోలీస్ అధికారులు తెలిపారు. ఈ పర్యటనలో ఆర్ఐ పట్నాయక్ తదితరులు ఉన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి-కాజులూరు

మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఏర్పాటు చేసినట్టు ఎంపిడిఒ జయ రాంబాబు తెలిపారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఎంపిపి మాత భారతి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సర్పంచులు ఎంపిటిసి సభ్యులు, పలు శాఖల అధికారులు విధిగా పాల్గొనాలని సూచించారు.

జాబ్ మేళాలో 52 మందికి ఉపాధి

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 52 మంది ఉపాధి అవకాశాలు పొందారు. ఎపి రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన మినీ జాబ్ మేళాలో 4 కంపెనీలు ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 147మంది నిరుద్యోగులు హాజరవగా వీరిలో 52 మంది ఆయా కంపెనీలో ఉపాధి అవకాశాలు పొందారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ మురళి, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ ప్రేమ్ కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్యామ్ కిషోర్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రేవతి పాల్గొన్నారు.

ఈ నెల 24న పి-4 సర్వేపై గ్రామసభలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామాల్లో నిర్వహించిన పి-4 సర్వేపై ఈ నెల 24న అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని ఎంపిడిఒ డి.శ్రీ లలిత అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో పంచాయతీల కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ గ్రామసభల్లో పి-4 సర్వే ద్వారా గుర్తించిన లబ్ధిదారుల వివరాలు తెలియజేస్తారన్నారు. రోజురోజుకు ఎండ తీవ్రత ఎక్కువ అవుతున్నందున ప్రతి గ్రామంలో ప్రజలకు వేసవి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి రమణ, మండల కార్యాలయ ఎఒ ఎం.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సిఎం రిలీఫ్ ఫండ్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సిఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని కో ఆర్డినేటర్ మాజీ ఎంఎల్ఎ పిల్లి సత్యనారాయణ మూర్తి అనంత లక్ష్మి దంపతులు అన్నారు. పలువురు లబ్ధిదారులకు శుక్రవారం వారు చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సిఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు.

23న సామర్లకోటలో ఎడ్ల పరుగు పోటీలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోటలో ఈ నెల 23న శ్రీకుమార రామ భీమేశ్వర రాష్ట్రస్థాయి ఎడ్ల పొరుగు పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వహణ కమిటీ నాయకులు బిక్కిన రంగ, వల్లూరి దొరబాబు తెలిపారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ సామర్లకోట మండలం ఉండూరు రైల్వే గేటు వద్ద ఎన్ఎఫ్‌సిఎల్ రహదారిలో వల్లూరి సత్యేంద్ర కుమార్ మెమోరియల్ రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కూడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పాల్గొని ఈ పోటీలను ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.

సిఎం రిలీఫ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

సిఎం రిలీఫ్ ఫండ్ పథకం ప్రజల ఆరోగ్య రక్షణకు ఎంతో మేలు చేస్తుందని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. అచ్చంపేటలోని ఎంఎల్ఎ కార్యాలయంలో టిడిపి నాయకులు నిమ్మకాయల కిరణ్ కుమార్, ముత్యం రాజుబాబుల ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు లబ్ధిదారులకు ఎంఎల్ఎ చినరాజప్ప సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. సహాయం అందుకున్న లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

మూడు రోజులపాటు పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి -సామర్లకోట

సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, రావికంపాడు స్టేషన్ల మధ్య సిగ్నలింగ్ పనుల కారణంగా ఈ నెల 23, 24, 25 తేదీల్లో పలు రైళ్లను రద్దు రద్దు చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్టు స్టేషన్ మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ఉదయ్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు, గుంటూరు నుంచి విశాఖ వెళ్లే సింహాద్రి ఎక్స్‌ప్రెస్, కాకినాడ-విశాఖపట్టణం, రాజమండ్రి- విశాఖపట్టణం మధ్య నడిచే మరో నాలుగు రైళ్ల ఈనెల 24, 25 తేదీల్లో రెండువైపులా రద్దు అయినట్టు తెలిపారు.

హిందూ ముస్లిములు సమైక్యతకు కట్టుబడి ఉండాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

లౌకికవాద భారతదేశంలో హిందూ ముస్లిములు సమైక్యతతో మెలగాలని వైసిపి ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏలేశ్వరం జామియా మసీదులో శుక్రవారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా భారతదేశం సర్వ మత సమైక్యతకు చిహ్నం అని కొనియాడారు. షేక్ దిల్బర్ హుస్సేన్, అక్బర్ అలీ ఖాన్, సయ్యద్ అమీర్, వైకాపా నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవిందు, సుంకర రాంబాబు, సామంతుల సూర్య కుమార్ జువ్వెన వీర్రాజు, గోళ్ళ నాగేశ్వరరావు ఉన్నారు.